ప్రజాశక్తి

బుధవారం 06 ఆగస్టు 2025 | 5 | కర్నూలు





కాల్వ గ్రామంలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాలకు భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

'స్మార్ట్ మీటర్ల'పై నిరసనాగ్రహం..

- సెకీ ఒప్పందం రద్దు చేయాలి
- పాత మీటర్లనే కొనసాగించాలి
- కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల ముందు ధర్నాలు

స్మార్ట్ మీటర్లను, అదానీ సెకీ ఒప్పందం రద్దు చేయాలని, ట్రూ అప్ చార్జీలు, ఇతర సర్ చార్జీల పేరుతో ప్రజల దగ్గర నుండి దొంగచాటున వసూలు చేసే కరెంటు బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాల ఎదుట ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ధర్నాలు నిర్వహించారు. కర్నూలు నగరంలో విద్యుత్ సౌధ ఎస్ఇ కార్యాలయం, హంద్రీ బ్రిడ్జి (కల్లూరు దర్వాజా) పక్కన గల కరెంట్ ఆఫీస్, జొహరాపురం విద్యుత్ సబ్ స్టేషన్ల ముందు నాయకులు ధర్నా నిర్వహించారు. అలాగే కోడుమూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, పాణ్యం నియోజకవర్గాల్లో ఉన్న విద్యుత్ కార్యాలయాల ఎదుట ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు నిరసన ధర్నాలు చేపట్టారు. గత వైసిపి ప్రభుత్వం అదానీతో కుదుర్చుకున్న సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, పాత విద్యుత్ మీటర్లనే కొనసాగించాలని నినాదాలు చేశారు. కరెంట్ బిల్లులను తగ్గించాలని, సర్ చార్జీలను అదనపు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయ అధికారులకు నాయకులు వినతిపత్రాలు సమర్పించారు.



కల్లూరు దర్వాజా వద్ద ధర్నా చేస్తున్న పి.నిర్మల, నాయకులు



జొహరాపురంవద్ద ధర్నాలో పాల్గొన్న డి.గౌస్‌దేశాయ్, నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కల్లూరులోని హంద్రీ బ్రిడ్జి (కల్లూరు దర్వాజా) పక్కనగల కరెంట్ ఆఫీస్ ముందు సిఐటియు నగర అధ్యక్షులు డి. అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నిర్మల మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి రూ. 32 వేల కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. ఎన్నికలలో కూటమి నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బాదుడే బాదుడు అని చెప్పి, అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని పిలుపునిచ్చి అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పుడు అవే స్మార్ట్ మీటర్లను బిగించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ప్రజలను మోసగించడం కాదా అని ప్రశ్నించారు. ట్రూ అప్, ఇంధనపు సర్‌ఛార్జి, యూజర్ ఛార్జీల పేరుతో ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు. ఇది చాలదని మళ్లీ కరెంట్ ఛార్జీలు పెంచాలని ఆలోచించడం దుర్మార్గమన్నారు. దీనికి తోడు స్మార్ట్ మీటర్లను కూడా బిగించుకోవాలని ప్రజలపై ఒత్తిడి చేయడం అన్యాయమన్నారు. అనంతరం సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎం.రాజశేఖర్, మహిళా సంఘం కార్యదర్శి బంగి.పద్మ, ఆవాజ్ నగర కమిటీ కార్యదర్శి ఎస్ఎండి.షరీఫ్, డివైఎఫ్ఐ కె.రామకృష్ణ, రజక సంఘం జయమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో వి.నాగ స్వాములు, ఫైరోజ్, గౌస్‌బాషా, మాలిక్, శాలీనయ్యద్, చాంద్ బాషా, శ్రీనివాసులు, జాకీ, సుధాకర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

జొహరాపురం విద్యుత్ స్టేషన్ ఎదుట ... సిఐటియు, కెవిపిఎస్, డివైఎఫ్ఐ, ఐద్వా, ఐఎఫ్‌టియు తదితర కార్మిక ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జొహరాపురం విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ఆటో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి మెహమూద్ అధ్యక్షతన జరిగిన నిరసనలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్ మాట్లాడారు. ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో నారా లోకేష్ రైతులకు, రాష్ట్ర ప్రజలకు స్మార్ట్ మీటర్లను పగల గొట్టండి, స్మార్ట్ మీటర్ల ద్వారా కరెంట్ బిల్లులు పెరుగుతాయని ప్రచారం చేశారని, ఇప్పుడు అదే పనికిమాలిన పనిని కూటమి ప్రభుత్వం అమలు చేసుందని విమర్శించారు. చిన్న చిన్న వ్యాపార సంస్థలను భయపెట్టి దొంగ చాటున స్మార్ట్ మీటర్లను బిగించారని, ఇప్పుడు నివాస ప్రాంతాలకు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ప్రజలకు పని లేక సరైన పనులు లేక ఇబ్బంది పడుతున్నారని, ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం మరోసారి ట్రూ అప్ ఛార్జీల పేరుతో 12,771 కోట్ల రూపాయలను ప్రజల నుండి వసూలు చేసుకోవడానికి అనుమతి ఇవ్వడం దారుణమన్నారు. ప్రజల అనుమతి లేనిదే స్మార్ట్ మీటర్లు బిగించవద్దని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పినా మరో పక్క కరెంటు అధికారులను ఒత్తిడి పెంచి ఎన్ని బిగించారు రిపోర్ట్ ఇవ్వాలని, టార్గెట్ త్వరగా అమలు చేయాలని ఒత్తిడి ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నించారు. శిరిడి సాయి ఎలక్ట్రానిక్ కంపెనీ స్మార్ట్ మీటర్లను తయారు చేస్తుందంటూ వాటి అవినీతి గురించి మాట్లాడిన టిడిపి ఇప్పుడు ఆ సంస్థకే 8000 ఎకరాలు ముట్టజెప్పడం ఎంత మేరకు సమంజసమని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వం అదానితో చేసుకున్న సెకీ ఒప్పందాన్ని రద్దు చేసి, పాత కరెంటు మీటర్లనే కొనసాగించాలని, కరెంటు బిల్లులను తగ్గించాలని, సర్ ఛార్జీలను అదనపు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.విజయ రామాంజనేయులు, నాయకులు రంగస్వామి, కెవిపిఎస్ నగర అధ్యక్షులు రమణ, ఐద్వా నగర నాయకురాలు వేదమ్మ, డివైఎఫ్ఐ నగర ప్రధాన కార్యదర్శి మధు, ఐఎఫ్‌టియుసి జిల్లా నాయకులు తిరుపాలు, ఆటో యూనియన్ నగర అధ్యక్షులు కుమార్, కెవిపిఎస్ నాయకులు దాస్, ప్రజాసంఘాల నాయకులు మధు, ఇర్ఫాన్, మౌలాలి, వీరేష్, సురేష్, మద్దిలేటి, బహదూర్, నాగరాజు, అయ్యన్న, మద్దయ్య, అయ్యస్వామి, రమేష్, పురుషోత్తం, మహబూబ్, విజయ్, అనిల్, లక్ష్మణ, ఎల్లమ్మ, యేసు, మౌలాలి, రాధా, విజయలక్ష్మి, అమీనా, కమ్యూన్ బి పాల్గొన్నారు.

విద్యుత్ సౌధ ఎస్ఇ కార్యాలయం వద్ద.. కొత్త బస్టాండ్ దగ్గర ఉన్న విద్యుత్ సౌధ ఎస్ఇ కార్యాలయం ముందు సి.గురుశేఖర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా నాయకులు టి.రాముడు, రైతు సంఘం సహాయ కార్యదర్శి శ్రీనివాస రావు, ఏఐడిఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి హరీష్, నాగన్న, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి యం.డి.ఆనంద్ బాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి యన్.అలివేలు, డివైఎఫ్ఐ రాష్ట్ర కోశాధికారి వై.నగేష్, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, విద్యుత్ ఛార్జీల భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ నాయకులు కె.విక్రమ్, వీరేష్, రజక సంఘం నాయకులు సి.రాముడు, ఐద్వా నాయకురాలు పియస్. సుజాత, సావిత్రి, సిఐటియు నాయకులు సి.చలపతి, ఎస్‌యుసిఐసి నాయకులు నాగన్న, కెవిపిఎస్ నగర కార్యదర్శి యం.భాస్కర్, నాయకులు యస్.రోశయ్య, మద్దిలేటి, బి.రాము, లాల్‌అహ్మద్ పాల్గొన్నారు.

బి.క్యాంప్ కరెంట్ ఆఫీస్ ఎదుట.. కర్నూల్ నగరంలోని బి క్యాంప్ కరెంటు ఆఫీస్ ముందు ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు రజక సంఘం న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి అధ్యక్షత వహించారు. ఎఇ రాఘవేంద్ర ప్రసాద్ ధర్నా వద్దకు వచ్చి వినతి పత్రాలను స్వీకరించారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్ నరసింహులు, ఆటో యూనియన్ నగర కార్యదర్శి బి.రాధాకృష్ణ మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సెంట్రింగ్ యూనియన్ నాయకులు లియాకత్ అలీఖాన్, రజక సంఘం ఓల్డ్ సిటీ కార్యదర్శి సి.శ్రీనివాసులు, సిపిఎం 23వ వార్డు కార్యదర్శి శివ జనార్ధన్ రావు, కెవిపిఎస్ 23వ వార్డు కార్యదర్శి పి.బాబురావు, 19వ వార్డు నాయకులు శివ పెదబాలు, నాయకులు ఎల్లయ్య, రాజశేఖర్, నాగరాజు, రాజశేఖర్, మల్లీ, శివకృష్ణ, మౌలాలి, అబ్బాస్, శ్రీనివాసులు, బిన్నమ్మ, సీతమ్మ, నాగలక్ష్మి, సోమేశ్వరమ్మ, జాన్సన్, ప్రసాద్, రాజు, శేఖర్, రిటైర్డ్ ఉద్యోగులు బవి రెడ్డి మహమ్మద్ గౌస్, అబ్దుల్ సలాం, షైఫ్, కృష్ణ సూర్య రాజు, మధు, మౌలాలి, నాగన్న పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ దగ్గర విద్యుత్ డిఈ కార్యాలయం వద్ద.. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్ల విధానానికి వ్యతిరేకంగా రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న విద్యుత్ డిఈ కార్యాలయం ముందు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర అధ్యక్షతన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు హుసేనయ్య, బీసన్న, వ్యకాసం నాయకులు శ్రీరాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అంజి మాట్లాడారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈకి వినతి పత్రం అందజేశారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రకాష్, మండల నాయకులు కిషన్, రైతు సంఘం జిల్లా నాయకులు ఆంజనేయులు, నాయకులు శ్రీనివాసరెడ్డి, సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు ఏసన్న, సంజీవ, చెన్నయ్య, మధు, ఆంజనేయులు, విశ్వనాథ్, కిరణ్, శివ పాల్గొన్నారు.



కొత్తబస్టాండ్ వద్ద విద్యుత్ సౌధ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు



రైల్వే స్టేషన్ దగ్గర విద్యుత్ డిఈ కార్యాలయం ఎదుట..



బి.క్యాంప్ కరెంట్ ఆఫీస్ వద్దకు ఎఇకి వినతి అందజేస్తున్న నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పేర్కొన్నారు. మంగళవారం ఓర్వకల్లు మండలంలోని కాల్వ గ్రామంలో ఓవర్ హెడ్ స్టోరేజ్ ట్యాంక్‌ల పనులకు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, టిటిడి బోర్డు చైర్మన్, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎప్పటికప్పుడు స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో జిల్లా పరిషత్, మండల పరిషత్, పంచాయతీ నిధులను తాగునీటి అవసరాలకు ఉపయోగించుకోవాలన్నారు. జల్ జీవన్ మిషన్ గ్రాంట్ కింద కోటి 12 లక్షల రూపాయల వ్యయంతో 90 కిలో లీటర్లు, 40 కిలో లీటర్లు కెపాసిటీ కలిగిన రెండు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌లను నిర్మిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. అనంతరం గ్రామంలో ఉన్న కోనేటి ఆంజనేయ స్వామి దేవాలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, ఓర్వకల్లు మండల స్పెషల్ అధికారి, డ్వామా పిడి వెంకటరమణయ్య, కర్నూలు ఆర్డీఓ సందీప్, తహశీల్దార్ విద్యా సాగర్, ఎంపిడిఒ శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూఎస్ డిఈ అమల, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మార్గదర్శకులును గుర్తించాలి

పి4 విధానం ద్వారా బంగారు కుటుంబాలను తీర్చిదిద్దడం కోసం మార్గదర్శకులను వెంటనే గుర్తించాలని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతి నుండి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రంజిత్ బాష, జెసి బి.నవ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈనెల 19 నుంచి పి4 అమలుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలను, విధివిధానాలపై ఒక బుక్లెట్ రూపొందించామన్నారు. ఈ నెల 15వ తేది నాటికి పి4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా అనుసంధానం చేయడం పూర్తి చేయాలన్నారు.

ఆదాయం పెంచి.. అభివృద్ధి చూపిస్తాం

- స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటాం : మంత్రి టీజీ భరత్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్‌కి ఆదాయాన్ని పెంచి, వాటితో నగరాన్ని తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంగళవారం కర్నూలు నగరంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి రెడ్డి, కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి మంత్రి టీజీ భరత్ కీలకమైన మూడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా 13వ వార్డు ఆనంద్ థియేటర్ ఎదురుగా హంద్రీ నది వద్ద రూ.15 లక్షలతో పాకెట్ పార్కులో పచ్చదనం ఏర్పాటుకు, 2వ వార్డులో క్రెడాయ్ అధ్వర్యంలో గడియారం ఆసుపత్రి ఆధునికీకరణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అలాగే 19వ వార్డు జొహరపురం రోడ్డున నగరపాలక సంస్థ, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ పంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ పన్నుల మీదే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే మరో పెట్రోల్ పంప్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్పొరేషన్ వాహనాలు కూడా ఇక్కడి ఇంధనాన్నే వినియోగించుకోవడం ద్వారా ప్రజాధనాన్ని ఆదా చేయవచ్చన్నారు. ఆనంద్ థియేటర్ ఎదురుగా హంద్రీ నది ఒడ్డున మునుపు డంప్ ఏర్పడి, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఉండేదని, ఆ ప్రదేశాన్ని శుభ్రం చేసి పాకెట్ పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఇప్పటికే గ్రావెల్, ఫెన్సింగ్ పనులు పూర్తి అయ్యాయని, త్వరలో పచ్చదనం పెంపునకు శ్రీకారం చుట్టామన్నారు. పాత నగరంలో పురాతన కట్టడమైన గడియారం ఆసుపత్రికి పూర్వవైభవం తీసుకొచ్చి, పరిసరాల ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తమ విజ్ఞప్తి మేరకు క్రెడాయ్ సంస్థ గడియారం ఆసుపత్రిని దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చిందని, ముందుగా రూ.20 లక్షలతో ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టామన్నారు. త్వరలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మాట్లాడుతూ కల్లూరు అర్బన్ రూపురేఖలను మారుస్తామన్నారు. 16 వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో రూ.50 కోట్ల ప్రత్యేక నిధులతో మౌలిక వసతుల అభివృద్ధి చర్యలు తీసు కుంటున్నట్లు చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధుల ఆలోచనల మేరకు నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్పొరేషన్‌కి ఆర్థిక వనరులు సమకూర్చేందుకు ప్రజాప్రతినిధులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని కొనియాడారు. క్రెడాయ్ సంస్థ గడియారం ఆసుపత్రిని దత్తత తీసుకునేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. అందరి సహకారంతో నగరాన్ని తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.



గడియారం ఆస్పత్రిలో మాట్లడుతున్న కమిషనర్



గుంత పడిన రహదారిని పరిశీలిస్తున్న నాయకులు

రహదారి సమస్యను పరిష్కరించండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి - పత్తికొండ

తుగ్గలి మండలం రాతన గ్రామం నడిబొడ్డులో ఉన్న రహదారి సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. మంగళవారం గౌస్ దేశాయి, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా నాయకులు వీరశేఖర్, సీనియర్ నాయకులు రంగారెడ్డి, నాయకులు సురేంద్ర, రమేష్, మధుతో కూడిన సిపిఎం ప్రతినిధి బృందం రాతన గ్రామ నడిబొడ్డున గుంతగా మారిన రోడ్డును స్థానికులతో కలిసి పరిశీలించి, అక్కడే నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామం మధ్యలో ఉన్న ప్రధాన రహదారి అడుగు లోతు గుంత పడినా అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. పత్తికొండ నుంచి గుత్తికి వెళ్లే భారీ వాహనాలు ఈ రోడ్డు వెంట వెళ్తూ ఎప్పుడు కింద పడతాయో అనే భయంతో ప్రజలు ఉంటున్నారన్నారు. వర్షమొస్తే గుంత నుంచి ద్విచక్ర వాహనాలు, పాదచారులు నిత్యం ప్రమాదానికి గురికావాల్సి వస్తోందన్నారు. రోడ్ల నిర్మాణానికి నిధులు వచ్చాయని చెబుతున్న అధికారులు ప్రధాన రహదారిలో గుంతలు పూడ్చడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. కలెక్టర్ జోక్యం చేసుకుని ఆర్అండ్‌బి, రెవెన్యూ అధికారుల ద్వారా పరిశీలించి రహదారిలో గుంతలను పూడ్చాలని డిమాండ్ చేశారు.

పుల్లన్న, గిడ్డయ్య సేవలు మరువలేనివి

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రజక వృత్తిదారుల సంఘం బలోపేతానికి పుల్లన్న, గిడ్డయ్య సేవలు మరువలేనివని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్, సిఐటియు నాయకులు రాముడు తెలిపారు. మంగళవారం వీరనారి ఐలమ్మ కార్యాలయంలో రజక వృత్తిదారుల సంఘం కర్నూలు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో న్యూ సిటీ కార్యదర్శి సి.శేషాద్రి అధ్యక్షతన ఐదో వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా పుల్లన్న, గిడ్డయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పుల్లన్న, గిడ్డయ్యలు 2000వ సంవత్సరంలో రజక వృత్తిదారుల సంఘం ఏర్పడిన తర్వాత జిల్లాలో సంఘం విస్తరణకు ఎనలేని కృషి చేశారన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఓల్డ్ సిటీ కార్యదర్శి సి.జయమ్మ, ఉపాధ్యక్షులు ఈశ్వరమ్మ, జిల్లా ట్రెజరర్ సిహెచ్.శ్రీనివాసులు, న్యూ సిటీ అధ్యక్షులు సి.రాముడు, పుల్లన్న కుటుంబ సభ్యులు రమణ, శ్రీనివాసులు, దేవేంద్ర, మధు, నగర కమిటీ సభ్యులు సి.ఎల్లయ్య, మద్దిలేటి, కర్రన్న, పకీరప్ప, దర్గమ్మ, జయమ్మ, శివ, మధు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజల మధ్య వేడుకలు జరుపుకోవడం నా అదృష్టం

- రాష్ట్ర మంత్రి టిజి.భరత్
- కర్నూల్లో ఘనంగా భరత్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

ప్రజల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ తెలిపారు. కర్నూలులో మంత్రి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యులు, ఆయన అభిమానులు, వివిధ పార్టీల నాయకులు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్నూలులోని వివిధ వార్డుల్లో తిరుగుతూ నాయకులు ప్రజలతో కలిసి వేడుకలు జరుపుకుంటున్న ట్లు తెలిపారు. అన్నదానం, రక్తదానం, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు.

ప్రత్యేక పూజలు : మంత్రి భరత్ స్వగృహంలో వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఆ తర్వాత జిల్లా గోరక్షణ మహా సంఘం గోశాలలో భరత్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గోమాతకు నమస్కారం చేసి ప్రదక్షిణలు చేశారు. అనంతరం ముస్లింలు ప్రార్థనలు చేశారు. ఓల్డ్ బస్టాండులోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో పాస్టర్లు ప్రార్థన చేశారు. అనంతరం చిన్న అమ్మవారి శాలలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు.

సేవా కార్యక్రమాలు : పెద్ద మార్కెట్‌లోని చేపల మార్కెట్ వద్ద టిడిపి నాయకులు చేపల రమేష్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ చేపట్టారు. మంత్రి భరత్ పాల్గొని మహిళలు, వృద్ధులకు చీరలను పంపిణీ చేశారు. డివిఆర్ సంస్థల తరపున గోశాలకు ట్రాక్టరును మంత్రి భరత్ చేతుల మీదుగా వెంకటేశ్వర రెడ్డి అందించారు. అనంతరం సి.క్యాంపులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఆ తర్వాత శ్రీరామ్ నగర్లో ఏర్పాటు చేసిన రక్తదాన కార్యక్రమాన్ని మంత్రి భరత్ ప్రారంభించారు. ప్రభుత్వాస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని భరత్ ప్రారంభించారు. అనంతరం స్ట్రెచర్స్ పంపిణీని చేపట్టారు. రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ మన్సూర్ అలీఖాన్ జిజిహెచ్ వద్ద పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం మౌర్య ఇన్‌లో పేపర్ ప్లేట్స్ మ్యానుఫ్యాక్చరింగ్ మిషన్లను మహిళలకు పంపిణీ చేశారు. అంతకుముందు కొండారెడ్డి బురుజు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 1, 2, 10, 11, 12, 48, 49, 50, 51, 52వ వార్డుల నాయకులు, కార్యకర్తలు వచ్చి మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. గజమాల వేసి అనంతరం కేక్ కట్ చేయించారు. జమ్మిచెట్టు ప్రాంతం, సి.క్యాంపు టిజివి కళా క్షేత్రంలో ప్రాంతంలో వద్ద ఏర్పాటు చేసిన సభలో మంత్రి భరత్ పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలో వేశారు. టిడిపి నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, కార్పొరేటర్ కురువ పరమేష్, అబ్బాస్, సుంకన్న, రామాంజనేయులు, మన్సూర్ అలీ ఖాన్, టిడిపి సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, బి.మనోజ్ పాల్గొన్నారు.



స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

- వామపక్ష, ప్రజాసంఘాల ఐక్యవేదిక పిలుపు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

స్మార్ట్ మీటర్లను రద్దు చేయకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని నాయకులు హెచ్చరించారు. సిపిఎం, ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కల్లూరు ఎస్టేట్‌లోని విద్యుత్ ఎఇ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. ముందుగా ఎస్టేట్ హమాలీ యూనియన్ అడ్డా నుంచి ర్యాలీగా బాషా హోటల్, ఆయిల్ అండ్ రైస్ మిల్, ఎపిసీడ్స్ మీదుగా విద్యుత్ కార్యాలయానికి ర్యాలీ నిర్వహించారు. డివైఎఫ్ఐ, సిఐటియు, కెవిపిఎస్, రజక వృత్తిదారుల సంఘం, పట్టణ పౌర సంక్షేమ సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప అధ్యక్షత వహించారు. సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్.సాయిబాబా, సిఐటియు నాయకులు ఎం.గోపాల్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎస్.హుస్సేన్ బాష, కెవిపిఎస్ నగర అధ్యక్షులు జి.ఏసు, రజక వృత్తిదారుల సంఘం సి.దేవేంద్ర, పట్టణ పౌర సంక్షేమ సంఘం నగర నాయకులు సివి.వర్మ, ఐద్వా నాయకులు ఉమా, లక్ష్మీదేవి మాట్లాడారు. ప్రజల అనుమతి తీసుకోకుండా స్మార్ట్ మీటర్లు బిగించడం ఏమిటని ప్రశ్నించారు. అనేక రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ పగలగొడుతున్నారని, ఇది కూడా గ్రహించని కూటమి ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. అనంతరం ఎఇ సుజాత ధర్నా వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. ఎంసి.ఆనంద్, బి.చిన్న, టి.రామనాగిరెడ్డి, జె.శ్రీనివాసులు, జలాలుద్దీన్, కె.పెద్దమధు, గోవిందు, లక్ష్మన్న, రమణ, జి.మౌలాలి, సరోజమ్మ, మరియమ్మ, లక్ష్మీదేవి, ఆటో యూనియన్ నాయకులు బి.అయ్యస్వామి, ఎం.లక్ష్మయ్య, అక్బర్, రవి హాజరయ్యారు. అలాగే ఉలిందకొండ విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. రైతుసంఘం మండల కార్యదర్శి ఎ.కృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి కె.మధు, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు మనోధర్, వ్యకాస మండల కార్యదర్శి కె.శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మారెన్న, రాజు, అంజి, బొల్లవరం వెంకటస్వామి, భాస్కర్ పాల్గొన్నారు. **పత్తికొండ** అంబేద్కర్ సర్కిల్ కూడలి నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారి దీప్తికి వినతి పత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య మాట్లాడారు. సిఐటియు నాయకులు ఎం.రవిచంద్ర, సిపిఐ మండల కార్యదర్శి యు.కారుమంచి అధ్యక్షత వహించారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు గంగన్న, వ్యకాస నాయకులు నరసన్న, బుజ్జులు, రైతు సంఘం నాయకులు సిద్ధయ్య గౌడ్, ప్రజానాట్యమండలి నాయకులు ఖాసీం, రమేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి మంజు పాల్గొన్నారు. **గూడూరు**లో విద్యుత్ కార్యాలయం ముందు కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయ ముట్టడి చేపట్టారు. సిఐటియు డివిజన్ కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు యువగలం పాదయాత్రలో నారా లోకేష్ రైతులకు రాష్ట్ర ప్రజలకు స్మార్ట్ మీటర్లు పగలగొట్టి స్మార్ట్ మీటర్ల ద్వారా కరెంట్ బిల్లు పెరుగుతాయని ప్రజలు నష్టపోతారని ప్రచారం చేశారని, ఇప్పుడు భయపెట్టి, దొంగచాటుగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. వెంకటేశ్వర్లు, రాజశేఖర్, నాగరాజు, రైతు సంఘం మండల నాయకులు కోటయ్య, డివైసి మండల నాయకులు కార్మికులు పాల్గొన్నారు. **కోడుమూరు (రూరల్)** పట్టణంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, జిల్లా అధ్యక్షులు బి.కృష్ణ హాజరయ్యారు. సిపిఐ, సిపిఎం నాయకులు బి.రాజు, కె.రాజు, గఫూర్‌మియా, మాజీ ఎంపీటీసీ మునిస్వామి, వీరన్న పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ : స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఓర్వకల్‌లోని విద్యుత్తు ఆఫీసు ఎదుట నిరసన తెలియజేశారు. సిఐటియు మండల కార్యదర్శి జి.శ్రీధర్ అధ్యక్షత వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న, సిఐటియు మండల అధ్యక్షులు ఎస్ షాజహాన్, ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్ మధుసూదన్, వ్యకాస మండల నాయకులు టి.మల్లేష్ పాల్గొన్నారు.



ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని ఎఇ ఆఫీస్ దగ్గర ధర్నా

'క్యాన్సర్'పై అవగాహన అవసరం

- మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్



శిక్షణలో మాట్లాడుతున్న వక్తలు

క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ తెలిపారు. మంగళవారం ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని స్టేట్ క్యాన్సర్ ఆస్పత్రిలో అసంక్రమిక వ్యాధుల ఎన్‌సిడి, క్యాన్సర్ వ్యాధిపై సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే స్త్రీ వ్యాధి నిపుణులకు, దంత వైద్య నిపుణులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే నియంత్రించవచ్చని తెలిపారు. డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ మాట్లాడుతూ... క్యాన్సర్ వ్యాధిపై ఎన్నో అపోహలు ఉన్నాయని, వాటన్నింటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, తగిన శరీరక శ్రమ లేకపోవడంతో రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. క్యాన్సర్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ... క్యాన్సర్ వచ్చేది ఒక వ్యక్తికే అయినా కుటుంబాన్నంత బాధిస్తుందని తెలిపారు. అసంక్రమిక వ్యాధుల పర్యవేక్షణ అధికారి డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్, వైద్యులు వెంకట సుబ్బ నాగరాజు, డాక్టర్ సాయి మాధురి, డాక్టర్ బిందు మాధవి, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ సందీప్ రెడ్డి, డాక్టర్ మోహన కృష్ణ, డాక్టర్ విజయ భాస్కర్, డాక్టర్ మంజూష, డాక్టర్ శైలేష్, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఎన్‌సిడి ఎపిడమలజిస్ట్ వేణుగోపాల్, ఆర్‌కెఎస్‌కె కన్సల్టెంట్ మల్లికార్జున, ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

సేంద్రీయ సాగు పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - సిబెళగల్

సేంద్రీయ ఎరువుల వాడకంపైన, సాగులపైన తుంగభద్ర సేంద్రీయ ఎరువుల, విత్తన, ధాన్య రైతు పరస్పర సహకార సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ ఆది నారాయణ మంగళవారం అవగాహన కల్పించారు. కొండాపురంలోని కార్యాలయంలో కార్యక్రమ అధికారి రమణ అధ్యక్షతన ఆయన క్షేత్ర స్థాయిలో సదస్సు చేపట్టి మాట్లాడారు. సేంద్రీయ ఎరువుల సాగుతో పంటల ఉత్పత్తి ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. అలాగే రసాయన ఎరువులు వాడకంతో పంటల ఉత్పత్తి ద్వారా ఆరోగ్యం దెబ్బతింటుందని, సేంద్రీయ ఎరువుల సాగు పద్ధతులపై ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. హనుమంత్ యాదవ్, మాణిక్య రెడ్డి తదితరులను సన్మానించారు. సిబ్బంది ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా విజయుడు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్


నన్నూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు తలారి విజయుడు కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. డైరెక్టర్‌గా నియమితులైన విజయుడు మంగళవారం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డిని కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి రావడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.



గౌరు వెంకట్ రెడ్డిని కలిసిన డైరెక్టర్ విజయుడు

రైతు సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - నందవరం


ఎమ్మెల్యే బీవీని సన్మానిస్తున్న నాయకులు

రైతు సంక్షేమమే కూటమి ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన హాలహర్వి గ్రామంలో పర్యటించారు. ఆయనను హాలహర్వి నాయకులు, రైతులు ఘనంగా సన్మానించారు. హాలహర్వి రైతులు పండించే పంటలకు జీవనాడి అయిన దేశాయ్ చెరువును ఆయన సందర్శించారు. అందులో పూజా కార్యక్రమాలు చేపట్టి జలహారతి ఇచ్చారు. అనంతరం దిగువ కాలువకు నీటిని విడుదల చేశారు. కాలువకు నీరు విడుదల కావడంతో గ్రామంలోని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని సుమారు 400 ఎకరాలకు ఈ నీరు అందుతాయని తెలిపారు. హాలహర్వి నాయకులు మిల్లు నారాయణరెడ్డి, గ్రామ అధ్యక్షులు ఎర్రన్న, జగన్నాథ్ రెడ్డి, దావీదు, నాగరాజు, మణికుమార్, మాధవరావు దేశాయ్, మగళి ఈరన్న గౌడ్, ధర్మపురం గోపాల్, ముగతి భార్గవ్ యాదవ్, వీరారెడ్డి, నాగలదిన్నె జబ్బార్, ఉరుకుందు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టిడిపి నాయకులు గురు రాఘవేంద్ర సోగనూరు ఎత్తిపోతల పథకం పంపు హౌస్ నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ నీటిని విడుదల చేయడం ద్వారా కనకవీడు, పేట, కులూరు ప్రజలు, రైతుల పొలాల సాగుకు ఉపయోగించుకుంటారని తెలిపారు. అలాగే ఏనుగుబాల, గార్లదిన్నె రైతుల సాగుకు ఈ నీరు ఉపయోగపడుతుందని చెప్పారు.

విష జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు

- ప్రభుత్వ డాక్టర్ షేక్ అఫ్రోజ్ జహాన్

ప్రజాశక్తి - చిప్పగిరి


ఆశాల దినోత్సవం సమావేశంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

మండలంలోని 16 గ్రామాల్లో విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ డాక్టర్ షేక్ అఫ్రోజ్ జహాన్, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం చిప్పగిరి ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఆశాల దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి ఇంటి వద్ద దోమలు, లార్వాలు కనిపించకుండా ప్రజలను భాగస్వాములు చేయాలని ఆశాలకు సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమలు ఎక్కువగా ఉంటే దోమతెరలు వాడాలని తెలిపారు. ఆశా కార్యకర్తలందరూ వారి పరిధిలో ఉన్న కుటుంబాలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య సిబ్బంది హరిచందన, సుశీల, రాజశేఖర్ గౌడ్, సుజాత, రామ్మోహన్, చంద్రకళ పాల్గొన్నారు.

టిడిపి నాయకుడు మల్లకల్ మృతి

- ఎమ్మెల్యే బీవీ నివాళి

ప్రజాశక్తి - గోనెగండ్ల


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీవీ

గోనెగండ్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు పూజారి మల్లకల్(55) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. మల్లకల్ సుదీర్ఘకాలంగా టిడిపిలో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వారు. రేషన్ షాపును కూడా నిర్వహించేవారు. గత రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి మల్లకల్ గృహానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులు తిరుపతయ్య నాయుడు, టౌన్ ప్రెసిడెంట్ రహమతుల్లా పాల్గొన్నారు.


మల్లకల్

తల్లిపాలు అమృతం లాంటిది : సిడిపిఒ

ప్రజాశక్తి - ఆలూరు


మాట్లాడుతున్న సిడిపిఒ

పుట్టిన ప్రతి బిడ్డకూ తల్లిపాలు అమృతం లాంటిదని ఆలూరు సిడిపిఒ కె.నరసమ్మ తెలిపారు. మంగళవారం పెద్దహోతూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పుట్టిన బిడ్డలకు ఇచ్చే తల్లిపాల గురించి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వివరించి అవగాహన కలిగించారు. సూపర్‌వైజర్ ఎం.ఈరమ్మ, అంగన్వాడీ వర్కర్స్ వెంకటలక్ష్మి, లోకేశ్వరి, పుష్పావతి, లేపాక్షి పాల్గొన్నారు.

దంచి కొట్టిన వర్షం...

- **ఆదోనిలో 82.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు**
- **లోతట్టు ప్రాంతాలు జలమయం**
- **ఇళ్లలోకి చేరిన నీరు.. ఇబ్బందులు పడ్డ జనం**

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో వర్షం దంచి కొట్టింది. మంగళవారం తెల్లవారుజాము నుంచి కుండపోత వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 82.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. పట్టణంలోని ఆవుదూడ వంక పొంగిపొర్లడంతో బోయగేరి, వడ్డే గేరి, బార్‌పేట, ఖానీమహల్ ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరి నిత్యావసర సరుకులు తడిసిపోయాయి. ఇళ్లల్లోకి చేరిన నీటిని బకెట్లతో తోడి బయటకు పారబోశారు. కల్వర్టుల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయి నీరు పారేందుకు అవకాశం లేకపోవడంతో ఇళ్లల్లోకి చేరాయి. సుమారు 2 గంటల పాటు వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉదయం వంట చేసుకునేందుకు కూడా లేకపోవడంతో పస్తులు ఉండాల్సి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణ బోయగేరి, వడ్డేగేరిలోని ఆవుదూడ వంకలో కాలువల్లోని చెత్తాచెదారం తొలగించి నీరు పారేలా ఏర్పాటు చేశారు.

సబ్ కలెక్టర్ సందర్శన

పట్టణంలోని లోతట్టు ప్రాంతమైన రాయనగర్ కాలనీల్లో మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పర్యటించారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకొని నీటి నిల్వలు తొలగించాలని మున్సిపల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా స్థానిక అధికారులను సంప్రదించి సహాయం పొందాలని తెలిపారు. పట్టణంలో డ్రైనేజీ, కాలువల శుభ్రత, వర్షపు నీటి పారుదల పనులు వేగవంతం చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. అధిక వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి సురక్షితమైన ప్రాంతానికి తరలించాలన్నారు. వారికి అవసరమైన పునరావాసం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ బాబు, వీఆర్ఓ లక్ష్మయ్య ఉన్నారు.


ఆదోనిలో ఆవుదూడ వాగులో చెత్తాచెదారం తొలగిస్తున్న సిబ్బంది

వంక వెడల్పు చేయించిన ఛైర్మన్

రాయనగర్‌లో ప్రవహిస్తున్న వంకలో ముళ్లపొదలు పరుచుకుపోయాయి. నీళ్లు పారలేక ఇళ్ల మధ్యలోకి చేరాయి. కాలనీల్లో పర్యటించిన ఎమ్మెల్యే డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి, వైస్ ఛైర్మన్ నరసింహులు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ఇళ్లలోకి నీరు చేరడం వల్ల నిత్యావసర సరుకులు తడిసిపోయాయని, పస్తులు ఉన్నామని, తామెలా బతికేది అంటూ కాలనీ మహిళలు వాపోయారు. వంక వెడల్పు చేయించి ఇళ్ల మధ్యలోకి నీరు రాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ తరఫున జెసిబిని రప్పించి వంక వెడల్పు, చెత్తాచెదారం తొలగింపు పనులు ముమ్మరం చేశారు. జాగ్రత్తలు తీసుకోని కారణంగానే సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపుతామని మున్సిపల్ ఛైర్మన్ లోకేశ్వరి హామీ ఇచ్చారు.


కౌతాళంలో నీటమునిగిన పంటలు

పొంగిపొర్లిన వాగులు, వంకలు

కౌతాళం : కౌతాళం మండలంలో ఎరిగేరి, తోవి, బదినేహాల్, కుంటనహాళ్, ఉప్పరహాల్, లక్ష్మమ్మ గుడి గ్రామాల్లో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కౌతాళం-ఉప్పరహాల్, కౌతాళం-బదినేహాల్, కుంటనహాల్-బదినేహాల్, ఎరిగేరి-కౌతాళం, తోవి-ఎరిగేరి గ్రామాల మధ్య వంకలు వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహించాయి. గంటల సమయం రాకపోకలు నిలిచిపోయాయి. వంకల సమీపంలో సాగు చేసిన పంటలు నీటిలో మునిగిపోయాయి. మండలంలోని అనేక గ్రామాల్లో వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఈ గ్రామస్తులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.

కాలనీలు జలమయం

దేవనకొండ : దేవనకొండలో చిన్నపాటి వర్షానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని మురుగునీటి కాలువ పొంగిపొర్లి ఆ ప్రాంతంలోని కాలనీలు జలమయమవుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి బస్టాండ్ దగ్గర ఉన్న మురుగు కాలువలో చెత్తాచెదారం ఉండడంతో వర్షపు నీరు చేరి రహదారి వెంట మురుగునీరు పారి సమీపంలోని కాలనీ ఇళ్లల్లోకి వెళ్లాయి. ఈ మురుగు నీటి ప్రవాహంతో ఆ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ కాలనీ వాసుల ఫిర్యాదుకు స్పందించిన పంచాయతీ కార్యదర్శి రవి పారిశుధ్య కార్మికులతో మురుగునీటి కాలువలో నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు.

మరో విద్యుత్ పోరాటం తప్పదు

- **సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ**
- **ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నాలు**

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

స్మార్ట్ మీటర్లను రద్దు చేయకపోతే మరో విద్యుత్ పోరాటం చేస్తామని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మిగనూరు డిఇ విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ఎస్.రాజు, బి.రాముడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ, ప్రజాసంఘాల ఐక్యవేదిక తాలూకా నాయకులు సత్యన్న, గణేష్, తిమ్మన్న మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ కంపెనీతో ఒప్పందం చేసుకున్న స్మార్ట్ మీటర్లను కూటమి ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వాణిజ్య షాపులకు బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని తెలిపారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయకపోతే మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు, ప్రజాసంఘాలు సిద్ధం కావాలని కోరారు. విద్యుత్ డిఇ నాగేంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ఎం.సత్తన్న, కె.హనీఫ్, బి.కాలప్ప, కె.ప్రసాద్, సి.హనుమంతు, ఎం.గణేష్, ఎస్.తిమ్మన్న, బాలరాజు, అబ్దుల్, రమేష్, జయన్న, కృష్ణ, ఖాజా బాష, రాజా, రమేష్, ఉస్మాని, ఆంథోని, ఎ.సురేష్, జె.నాగరాజు, చిన్ని, ప్రసాద్ బాబు, ఆమోష్, ఏసోబు, రామన్న పాల్గొన్నారు. **ఆలూరు** విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా నాయకులు కెపి.నారాయణ స్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు మాట్లాడారు. అదానీకి కట్టబెట్టిన స్మార్ట్ మీటర్లను గతేడాది నుంచే పరిశ్రమలకు, వాణిజ్య దుకాణాలకు, ఇళ్లకు బిగించి ప్రజల సొమ్మును కొల్లగొట్టేందుకు అనుమతులు ఇచ్చిందన్నారు. ఇళ్లకు బిగించే స్మార్ట్ మీటర్ రూ.10 వేలు విలువ చేస్తుందని, దీని నెలసరి విద్యుత్ బిల్లులో వేసి ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తూ పగలు ఒక రేటు, రాత్రి ఒకరేటు విద్యుత్ బిల్లులు వేస్తారని తెలిపారు. అనంతరం లైన్ ఇన్‌స్పెక్టర్ పంపావతికి వినతిపత్రం అందజేశారు. రైతుసంఘం నాయకులు పి.హనుమంతు, ఈరన్న, పరమేష్ గౌడ్, బికెఎంయు జిల్లా నాయకులు భూపేష్, ఎఐటియుసి నాయకులు రామాంజినేయులు, ఎస్ఎస్.బాష, రంగన్న, డివైఎఫ్ఐ నాయకులు మైనా, గోవర్ధన్, సిఐటియు నాయకులు నాగరాజు, వీరేష్, ఎస్ఎఫ్ఐ లక్ష్మి నారాయణ, ఐద్వా నాయకులు రత్నమ్మ, షేకున్‌బీ, రాధమ్మ, గౌసియాబీ పాల్గొన్నారు. **దేవనకొండ** సబ్ స్టేషన్ ముందు వామపక్ష, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా నాయకులు నరసారావు, వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష అధ్యక్షత వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి, వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్, సిఐటియు మండల కార్యదర్శి అశోక్, రైతు సంఘం మండల కార్యదర్శి సూరి, రైతు, వ్యకాస నాయకులు నల్లచెలిమిల బజారి, కండప్ప, ప్రజాసంఘాల నాయకులు సుధాకర్, రవీంద్ర, పెద్దయ్య, రాముడు, బండ్లయ్య, లింగన్న, ప్రసాద్, అబ్బాస్, రవి, రామాంజి, భాస్కర్, బాష, రషీద్, శ్రీనివాసులు, శేఖర్, చిన్న, ఆటో శంకర్, విజయ్, సీనయ్య పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలో మున్సిపల్ మైదానం నుంచి తిమ్మారెడ్డి బస్టాండ్ మీదుగా విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అధికారికి వినతిపత్రం ఇచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్‌బాబు, సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న, సిపిఐ, సిపిఎం పట్టణ కార్యదర్శులు వీరేష్, లక్ష్మన్న, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మల్లికార్జున, వెంకప్ప, సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి నాగరాజు, బిడిఎస్ఎఫ్ జిల్లా నాయకులు రమేష్ మాట్లాడారు. సిపిఎం పట్టణ నాయకులు గోపాల్, మండల కార్యదర్శి లింగన్న, సిపిఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, జిల్లా సమితి సభ్యులు సుదర్శన్ విజయ్, ఎఐటియుసి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకన్న, వైటి.భీమేష్, బికెఎంయు నాయకులు కొత్తూరు గంగన్న, రైతు సంఘం నాయకులు మదిరే ఎల్లప్ప, ఎఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి అజిత్ గౌడ్, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి రమేష్, వంశీ, ప్రదీప్, సిపిఎం నాయకులు రామాంజనేయులు, వీరారెడ్డి, నాగరాజ్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు నాగరాజు, మహిళా నాయకులు మణి, కుమార్, సోమశేఖర్ పాల్గొన్నారు. **కౌతాళం** విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న అధ్యక్షత వహించారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, రైతు కూలీ సంఘం నాయకులు జగదీష్, నాగేంద్రప్ప, రైతుసంఘం నాయకులు రామాంజనేయులు, నారాయణప్ప, వెంకటేష్, వ్యకాస నాయకులు సత్యప్ప, వీరేష్, కెవిపిఎస్ నాయకులు చిన్న మారయ్య, తాయప్ప, ఆదాం, బసవ, రైతు కూలీ సంఘం నాయకులు రమేష్, వీరేష్, ఈరన్న, ఆలం బాష పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి విద్యుత్ ఎఇ సుధాకర్ రావుకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం, సిపిఐ, కెవిపిఎస్, ఎపిడికెఎస్, సిఐటియు, ఎఐటియుసి ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు బి.కరుణాకర్, మద్దిలేటి నాయుడు, నబీ రసూల్ మాట్లాడారు. **హోళగుంద** విద్యుత్ కార్యాలయం ముందు వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయకపోతే మరో విద్యుత్ పోరాటం చేస్తాం సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంసి), వైసిపి మండల కార్యదర్శులు వెంకటేష్, మారెప్ప, సవారప్ప, సఫీవుల్లా తెలిపారు. విద్యుత్ డిఇ నాగేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఎఐటియుసి రంగన్న, ఎస్‌కె.గిరి, హమాలీలు నగేష్, ఉలిగప్ప, దేవన్న, గంగన్న, గురుపద్ పాల్గొన్నారు. **హాలహర్వి** ఎఇ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిఐటియు మండల నాయకులు కృష్ణ, రైతు సంఘం నాయకులు ధనుంజయ్, హమాలీ సంఘం నాయకులు దుర్గప్ప పాల్గొన్నారు. **మంత్రాలయం** విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, లైన్ ఇన్‌స్పెక్టర్ నరసప్పకు వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి హెచ్.జయరాజు, సిఐటియు నాయకులు టి.ప్రాణేష్, టి లక్ష్మన్న, వ్యకాస నాయకులు డి.ఆంధ్రయ్య, రైతుసంఘం నాయకులు ఎస్.వీరేష్, కెవిపిఎస్ నాయకులు జి.అంజి పాల్గొన్నారు. **ఆస్పరి** విద్యుత్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిపిఐ మండల కార్యదర్శి విరుపాక్షి అధ్యక్షత వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి నాగేంద్రయ్య, సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, హనుమంతు, బడే సాబ్, ఈరన్న, మధు రెడ్డి, రవి, శ్రీకాంత్, వీర బద్రి, రాజశేఖర్, లక్ష్మన్న, ఎల్లప్ప, దస్తగిరి, సురేంద్ర, తరుణ్ పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో విద్యుత్ కార్యాలయం ముట్టడిలో మాట్లాడుతున్న రాధాకృష్ణ


ఆలూరులో మాట్లాడుతున్న అంజిబాబు


దేవనకొండలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



ఆదోనిలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు


హోళగుందలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్ద చెరువుపై నిర్లక్ష్యం వీడాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పాండవగల్లు గ్రామంలో సర్వే నెంబర్ 135లో 20 ఎకరాల భూమిని భూస్వామి విజయలక్ష్మి ఆక్రమించి పొలాన్ని సాగు చేయడం వల్ల మంగళవారం కురిసిన వర్షానికి భారీగా నీళ్లు వృథాగా వెళ్తున్నాయని, ఈ సమస్యను కోర్టులో పెట్టి చోద్యం చూస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు మొద్దు నిద్ర వీడాలని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న విమర్శించారు. పెద్ద చెరువు నుంచి వృథాగా పోతున్న నీళ్ల దగ్గర నిలబడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 20 ఏళ్లుగా టిడిపి కానీ, వైసిపి ప్రభుత్వం కానీ పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం ద్వారా అయినా న్యాయం జరుగుతుందని 15 నెలలుగా ఎదురుచూస్తున్నా, పరిస్థితి గతానికంటే దారుణంగా ఉందని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పాండవగల్లు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సమస్యను వారంలో పరిష్కరిస్తామని, తనకు అందరూ ఓటు వేయాలని కోరారు. ఆయన గెలిచి 15 నెలలు కావస్తున్నా అన్ని సమస్యలపైనా అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే... పాండవగల్లు పెద్ద చెరువు విషయంపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కోర్టు కేసు విషయంలో అధికారులు కోర్టుకు వెళ్తున్నారా లేదా అని నిలదీశారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న చెరువు కేసును త్వరగా పరిష్కరించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. లేకపోతే సిపిఎంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు జె.రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు పాండురంగ, పాండవగల్లు శాఖ కార్యదర్శి అనిల్ బాష, పార్టీ సభ్యులు కృష్ణ, నర్సిరెడ్డి, హనుమంతరెడ్డి, కొండయ్య, గ్రామస్తులు గోవిందు రెడ్డి, పక్కీరయ్య, మల్లికార్జున, దివాన్ బాషా, రఫీక్ బాషా, తిక్కయ్య, లక్ష్మన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

30, 31న రాష్ట్ర మహాసభలు : ఆశావర్కర్స్

ప్రజాశక్తి - ఆస్పరి



గోడపత్రికలను విడుదల చేస్తున్న ఆశాలు

ఈ నెల 30, 31న కడపలో జరిగే ఆశావర్కర్ల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు దస్తగిరమ్మ, జిల్లా కార్యదర్శి రమీజాబీ కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో యూనియన్ మండల కార్యదర్శి రాధమ్మ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆశావర్కర్లు గర్భస్థ స్త్రీలను గుర్తించడం, వారి ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడం, గ్రామాల్లో అంటు వ్యాధులు రాకుండా నివారణ చర్యలను ప్రచారం చేయడంలో ఆశాలు ముందుంటారని తెలిపారు. ఆశాలు సువర్ణ, స్వర్ణలత, రాజి, లతా, మణి, వీరమ్మ పాల్గొన్నారు.


సందర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

టిడ్కో ఇళ్లను ఎప్పుడిస్తారు..?

- కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఎపడు కేటాయిస్తారో అధికారులు స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ శివారులోని గృహ సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు సాయినాథ్ మాట్లాడారు. టిడ్కో గృహ సముదాయాలను 2016లో పేదలకు ఇవ్వడంలో అప్పటి టిడిపి ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. తర్వాత వైసిపి ప్రభుత్వం పేదలకు ఇళ్లను అందిస్తుందేమోనని ఆశగా ఎదురుచూసిన లబ్ధిదారులకు నిరాశే మిగిలిందన్నారు. ఇంటి పట్టాలిచ్చి పత్రాలపై జగనన్న బొమ్మలు వేసుకున్నా ఇప్పటికీ సొంతింటి కల కలగానే మిగిలిందని దుయ్యబట్టారు. ఇళ్లకు వాకిళ్లు లేవని, కిటికీలు లేవని, పెయింటింగ్ లేదని వాపోయారు. నీటి పైపులు కనెక్షన్ లేవని, విద్యుత్ సదుపాయం లేదని తెలిపారు. ముళ్ల చెట్లతో నిండి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారే ప్రమాదం ఉందని, మున్సిపల్ కమిషనర్ స్పందించాలని చెప్పారు. రెండు వేలకు పైగా ఇళ్ల నిర్మాణం చేపట్టినా ప్రస్తుతం 50 కుటుంబాలు కూడా లేవన్నారు. ఇళ్ల నిర్మాణం త్వరగా నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దిలీప్ ఢోకా, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, ఆదోని యువజన అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్, ఎస్సీ సెల్ నాయకులు తాయన్న ఉన్నారు.

నాటుసారా జోలికి వెళ్లొద్దు : సిఐ

ప్రజాశక్తి - ఆదోని

ఆరోగ్యానికి హాని కలిగించే నాటుసారా జోలికి వెళ్లి ఆస్పత్రి పాలు కావద్దని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ సైదుల్ తెలిపారు. మంగళవారం ఆదోని ఎక్సైజ్ పోలీసు, కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆదోని సివిల్ పోలీసులతో కలిసి ఆదోనిలోని రణమండల కొండల్లో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అపరిశుభ్రమైన ప్రదేశాల్లో వారికిష్టమొచ్చిన పదార్థాలను కలిపి నాటుసారా తయారు చేస్తున్నారని, సారా తాగడం వల్ల అనారోగ్యం పాలై మృత్యువాత పడిన వారి సంఖ్య ఎక్కువగా ఉందని చెప్పారు. ఆదోని బోయ గేరికి చెందిన బోయ వీరేష్‌పై కేసు నమోదు చేశామన్నారు.

బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి

- శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం


మాట్లాడుతున్న శ్రీసుభుదేంద్రతీర్థులు

శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు ఆదేశించారు. మంగళవారం శ్రీమఠంలో సిబ్బందితో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 8 నుంచి 14 వరకు శ్రీరాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని సూచించారు. శ్రీమఠంలో ఎక్కడ, ఏ పాయింట్‌లో విధులు వేసినా సమర్థవంతంగా పని చేసి సేవలు అందించాలని కోరారు. దర్శనం, ప్రసాద వితరణ, పరిమళ ప్రసాదం విక్రయం, క్యూలైన్లు, ఇతర ప్రదేశాల్లో వేసిన విధులను నిర్వర్తించాలని తెలిపారు.

ముఖ్యమంత్రికి, ప్రముఖులకు శ్రీమఠం ఆహ్వానం


చంద్రబాబుకు ఆహ్వానం పలుకుతున్న సిబ్బంది

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి, సూపరింటెండెంట్ పురాణిక అనంతాచార్ ఆహ్వానించారు. ఈనెల 8 నుంచి 14 వరకు పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాలకు రావాలని మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి రాఘవేంద్రస్వామి మెమెంటోతో పాటు ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను కలిసి ఆహ్వాన పత్రిక, శ్రీమఠం నుంచి చీర, జ్ఞాపికను అందజేసి ఆహ్వానించారు. అలాగే రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులుకు ఆహ్వానం అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి రాఘవేంద్ర స్వామి జ్ఞాపికను అందజేసి ఆహ్వానం పలికారు. అలాగే వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు ఆహ్వానం పలికారు.

'అన్నదాత'తో రైతులకు లబ్ధి

- ఇన్‌ఛార్జీ ఎఒ శ్రీరామ్ ప్రవీణ్

ప్రజాశక్తి - చిప్పగిరి


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సిబ్బంది


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే సిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద మండలంలోని 7,246 మందికి లబ్ధి చేకూరిందని ఇన్‌ఛార్జీ ఎఒ శ్రీరామ్ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం ఆయన ఇన్‌ఛార్జీ ఎఒగా బాధ్యతలు స్వీకరించి మాట్లాడారు. కల్లూరు మండలంలో ఎఇఒగా విధులు నిర్వర్తించానని, ఇక్కడకు ఇన్‌ఛార్జీ ఎఒగా బదిలీపై వచ్చానని తెలిపారు. అనంతరం పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయ సలహాలు ఇచ్చారు. ఎఒ శ్రీరామ్ ప్రవీణ్‌ను వ్యవసాయ శాఖ సిబ్బంది పరిచయం చేసుకున్నారు. ఎఇఒ రమాదేవి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు రంగస్వామి, ప్రతాప్ నాయుడు, రైతులు పాల్గొన్నారు.


శ్రీరామ్ ప్రవీణ్

రైతులకు మంచి సేవలందించాలి : జనసేన

ప్రజాశక్తి - కౌతాళం

బదినేహాల్ సహకార సంఘం పరిధిలోని గ్రామ రైతులకు మంచి సేవలు అందించాలని జనసేన నాయకులు చిన్న కోరారు. మంగళవారం సహకార సంఘం అధ్యక్షులు బోయ మారెప్ప, సభ్యులు నరసింహను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో సామాన్య రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం రైతు బిడ్డలకు ఈ పదవులు దక్కడంతో రైతులకు సేవలు అందించే అవకాశం దక్కిందని తెలిపారు. రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు అందించి ఆదుకోవాలని కోరారు. రైతుల సంక్షేమం కోసం పనిచేస్తామని అధ్యక్షులు మారెప్ప, సభ్యులు నరసింహ పేర్కొన్నారు.


సన్మానిస్తున్న జనసేన నాయకులు



పరువు బురద పాలే..!

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని చింతకుంట గ్రామంలో రహదారి బురదమయంగా ఉంది. ఎవరైనా నడుచుకుంటూ కాలుజారి పడ్డారంటే పరువు బురదపాలు కావాల్సిందే..! మండలంలోని చింతకుంట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లాలంటే బురదలో నడుచుకుంటూ పోవాల్సిందే. విద్యార్థులే కాదు.. ఊళ్లోని ఎవరైనా బయటకు రావాలంటే ఆ మార్గమే దిక్కు. సరైన రహదారి సౌకర్యం లేక పిల్లలు బడికెళ్లాలన్నా అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. చివరికి పంట పొలాలకు వెళ్లాలన్నా దాదాపు 500 మీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వర్షాకాలంలో వీరి ఇబ్బందులు వర్ణనాతీతం. అధికారులు, ప్రజాప్రతినిధులు పరిష్కరించాలని కోరుతున్నారు.

బెల్లందొడ్డిలో పులి కలకలం

- భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి - దేవనకొండ


పులి ఆనవాళ్ల కోసం ఫారెస్ట్ అధికారుల పరిశీలన

మండలంలోని బెల్లందొడ్డి గ్రామంలో పులి కలకలం సృష్టించింది. గ్రామస్తులు భయాందోళనలో ఉన్నారు. మంగళవారం గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... పొలం పనులకు వెళ్లిన ఆ గ్రామ మహిళలకు సోమవారం పులి కనిపించిందని, ఒక్కసారిగా ఉరుకులు, పరుగులతో గ్రామంలోకి వచ్చి గ్రామస్తులకు తెలిపారు. గ్రామ శివారులో పులి ఉందని పుకార్లు షికార్లు చేశాయి. గ్రామస్తుల సమాచారంతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్విని, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నూర్జహాన్, బీట్ ఆఫీసర్ రవికుమార్ ఆ గ్రామానికి వెళ్లి పులి ఆనవాళ్లు గుర్తించడానికి పొలాల్లో పరిశీలించారు. పొలాల్లో తేమ, బురదతో ఉండడంతో ఆనవాళ్లు దొరకలేదని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

పైపులైన్ మరమ్మతులు పూర్తి

- 21, 25వ వార్డులకు యథావిధిగా తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

దేవనగర్ సమీపంలో అదనపు రైల్వే లైన్ పనుల కారణంగా దెబ్బతిన్న మున్సిపల్ 400 ఎంఎం పైపు లైన్ మరమ్మతు పనులు పూర్తయ్యాయని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన సమస్య ప్రదేశానికి వెళ్లి, మరమ్మతు పనులను పరిశీలించారు. అంతకన్నా ముందు 2వ వార్డులో ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రుసుం వసూళ్లు చేస్తున్న నోడల్ అధికారి, సచివాలయ కార్యదర్శుల వద్దకు వెళ్లారు. వారితో మాట్లాడి పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. దేవనగర్ సమీపంలో కెసి కెనాల్, రైల్వే లైన్ మధ్యలో మున్సిపల్ 400 ఎంఎం పైప్‌లైన్ ఉందని, సోమవారం రైల్వే లైన్ నిర్మాణ పనులు జరుగుతుండగా పైప్‌లైన్ పగిలిపోయిందని తెలిపారు. వెంటనే పైప్‌లైన్ మరమ్మతు పనులను ప్రారంభించి మంగళవారం సాయంత్రానికి పూర్తి చేశామన్నారు. ఫలితంగా 21, 25వ వార్డుల్లో తాగునీటి సరఫరా బుధవారం నుంచి యథావిధిగా జరుగుతుందని వెల్లడించారు. ఎంఇ మనోహర్ రెడ్డి, ఆర్‌ఒ జునైద్, డిఈఈలు గిరిరాజ్, నరేష్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు రఫి, మాధవస్వామి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.



మంత్రి భరత్ పుట్టినరోజు సందర్భంగా

జిజిహెచ్‌కు ట్రాలీల విరాళం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

మంత్రి టిజి.భరత్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా కర్నూలు సర్వజన వైద్యశాలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలులోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్ కిమ్స్ హాస్పిటల్ –5, ఒమేగా హాస్పిటల్ – 5, ఓల్డ్ అసోసియేషన్ వైద్యుల సంఘం – 5, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు – 5 మొత్తం 20 ట్రాలీలను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. కర్నూలు ప్రభుత్వాస్పత్రికి సహాయ, సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఇన్‌ఛార్జీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ పద్మజ, డాక్టర్ గోవింద్ రెడ్డి, డాక్టర్ బాలమద్దయ్య, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ శివ బాల, డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం : ఐసిడిఎస్ పీడీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తల్లిపాల సంస్కృతికి అనుకూల వాతావరణం కల్పించాలని ఐసిడిఎస్ పిడి విజయ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కెవిఆర్ గార్డెన్స్‌లోని బాపూజీ నగర్ - 3 అంగన్వాడి కేంద్రంలో కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల సంస్కృతికి కుటుంబ సభ్యులు మద్దతు ఎలా ఇవ్వాలో వివరించి, మంచి తల్లులకు చిరు దీవెనలు అందించడంతో పాటు తల్లిపాల వారోత్సవాల ప్రతిజ్ఞ చేశారు. పిడి పి.విజయ మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణ కోసం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోందని, దీనిని ప్రతి గర్భిణి, బాలింత విధిగా తీసుకోవాలని సూచించారు. దీనివల్ల తల్లి, పిల్లలు రక్తహీనతకు గురికాకుండా ఆరోగ్యంగా ఉండొచ్చని అన్నారు. పుట్టిన బిడ్డకు ఇచ్చే ముర్రిపాలు అమృతంతో సమానమని, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు, ఆ తర్వాత అనుబంధ పోషకాహారం అందించాలని తల్లులకు సూచించారు. బాలింతలకు కుటుంబంలో భర్త, అత్త మామల సహకారం చాలా అవసరం అన్నారు. మంచి ఆహారాన్ని ఇవ్వడంతోపాటు కొంత విశ్రాంతికి అవకాశం ఇవ్వాలని కుటుంబ సభ్యులను కోరారు. కార్యక్రమంలో సిడిపిఒ అనురాధ, ఈవో రాజేశ్వరి, సూపర్వైజర్ వరలక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మహిళలు పాల్గొన్నారు.

పి4తో ఎంపిపి పాఠశాల అభివృద్ధి : ఎంఇఒ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పి4 విధానాన్ని అమలు చేసి ఎంపిపి పాఠశాల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. విద్యా కమిటీ ఛైర్మన్ బొగ్గుల షేక్షావలీ ఉలిందకొండ ఎంపిపిపి రెగ్యులర్ స్కూల్‌లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడానికి ప్రధానోపాధ్యాయులు బ్రహ్మయ్య ఆచారితో సంప్రదించి ప్రతినెలా ప్రతి తరగతిలోనూ రెగ్యులర్‌గా స్కూల్‌కు వచ్చిన 10 మంది విద్యార్థులకు బహుమతులు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం స్టేజ్ దగ్గర సొంత నిధులతో షెడ్డు వేయించారు. ఎంఇఒ శ్రీనివాసులు, స్కూల్ స్టాఫ్, సింగిల్ విండో ఛైర్మన్ ఇవి.రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ షెడ్డు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎంఇఒలు శ్రీనివాసులు, వనజ కుమారి, ఉలిందకొండ సింగిల్ విండో ఛైర్మన్ ఇవి.రమణ పాల్గొని విద్యా కమిటీ ఛైర్మన్ షేక్షావలీని సన్మానించారు. విద్యా కమిటీ ఛైర్మన్ మిత్రులు విక్రమ్, శ్రీకాంత్, మధు, కిరణ్, రాజేష్, మహేంద్ర, అశోక్, హరికృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో.. జిల్లా క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

పల్నాడు జిల్లా వేదికగా ఇటీవల జరిగిన 19వ రాష్ట్రస్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో జిల్లా క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించినట్లు జిల్లా సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు తెలిపారు. అండర్ – 14 బాల బాలికల విభాగంలో 3వ స్థానం, అండర్ – 19 బాలికల విభాగంలో 3వ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కర్నూలు అవుట్డోర్ స్టేడియం లో జిల్లా క్రీడల అభివద్ధి అధికారి భూపతి రావు గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా భూపతిరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించడం గర్వకారణం అన్నారు. జాతీయ స్థాయి పోటీలలో కూడా జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శేషు, మల్లికార్జున పాల్గొన్నారు.

పిఆర్‌సి కమిషన్‌ను ప్రకటించాలి

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగులకు వేతనాల సవరణకు సంబంధించి 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బంగి శ్రీధర్ సురేష్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో టీ తాగుదాం మాట్లాడుకుందాం అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బంగి శ్రీధర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. గత పిఆర్‌సిలో ఉద్యోగులకు చెల్లించాల్సిన అరియర్స్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను కూడా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

శ్రీమఠంలో సినీ నటుడు సాయికుమార్

ప్రజాశక్తి - మంత్రాలయం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీరాఘవేంద్ర స్వామిని ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ మంగళవారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారికి ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్, సహాయ పిఆర్ హొన్నొళ్లి వ్యాసరాజ్ ఆచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, శ్రీరాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. పీఠాధిపతుల పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్.అప్రమేయాచార్, అల్లుడు కృష్ణస్వామి, ద్వార పాలకులు అనంత స్వామి, ప్రకాష్ స్వామి, పవన్ స్వామి, సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, కానిస్టేబుల్ రంగస్వామి పాల్గొన్నారు.

ఆశాలకు పనిభారం తగ్గించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పత్తికొండ : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఆశాలకు పనిభారం తగ్గించాలని సిఐటియు జిల్లా నాయకులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఐదో సచివాలయంలో ఆశా డే సందర్భంగా ఆశావర్కర్లు, సిఐటియు నాయకులు మెడికల్ ఆఫీసర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఎం.రవిచంద్ర, ఆశా వర్కర్స్ మండల కార్యదర్శి పావని, స్వాతి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

గోరంట్లలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్ : మండలంలోని గోరంట్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం ఎఒ రవి ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులకు వ్యవసాయంలో మెళకువలను ఎఒ వివరించారు. సద్దల ఈశ్వరయ్య రైతు పొలంలో పొలం పిలుస్తుంది నిర్వహించారు. పత్తి పొలంలో ఆకు ముడత వ్యాధి, పచ్చ దోమ, గొంగళి పురుగు నివారణ చర్యలను తెలిపారు. గోరంట్ల మజరా గ్రామమైన కొత్తపల్లి గ్రామ రైతులకు రామకృష్ణ, రాముడు, రైతులకు యూరియాను పంపిణీ చేశారు. సర్పంచి బాలకృష్ణ పాల్గొన్నారు.

కోడుమూరులో 'సుపరిపాలన తొలి అడుగు'

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్ : పట్టణంలోని ఎస్సీ కాలనీ ఒకటో వార్డు డోర్ టు డోర్ మంగళవారం టిడిపి నాయకుల ఆధ్వర్యంలో జరిగింది. కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆదేశాల మేరకు డోర్ టు డోర్ కార్యక్రమం జరిగింది. మాల మునుస్వామి, కేదాస్, మద్దిలేటి ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాలలో 'డ్రగ్స్ వద్దు బ్రో'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు ప్రభుత్వ బి క్యాంపు ఒకషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో ఈగల్ ఎస్ఐ సుజన్ కుమార్, సిబ్బంది వై.ఎలీషా, యస్.మాసూమ్ వలి, బి.రమేష్ పర్యవేక్షణలో విద్యార్థులకు డ్రగ్స్ వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ ప్రసన్న కుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, మల్లేశ్వరుడు, గిరిజారాణి, జసింత, శ్రావణి పాల్గొన్నారు.

లింగార్షక బుట్టలు తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - సి బెళగల్ : పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు లింగార్షక బుట్టలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎఒ మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం కొండాపురం, ముడుమాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టి సిబ్బంది సమీక్షలో మాట్లాడారు. లింగార్షక బుట్టలు పసుపు, తెలుపు రంగులో ఉంటాయని, ఎకరానికు 8 నుంచి 10 వరకు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. సిబ్బంది అఫ్రిన్, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి : ఎపిడబ్ల్యుజె

ప్రజాశక్తి - మద్దికెర : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఎపిడబ్ల్యుజె జిల్లా నాయకులు రాజేష్ గౌడ్ కోరారు. మంగళవారం తహశీల్దార్ గుండాల నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కమిటీ సభ్యులు తిక్కన్న, శేఖర్ బాబు, సుల్తాన్, చంద్రశేఖర్, విజయ్, రాము పాల్గొన్నారు.

మండల ప్రెస్ కమిటీ అధ్యక్షులుగా గోవిందు

ప్రజాశక్తి - నందవరం : మండల నూతన ప్రెస్ కమిటీ అధ్యక్షులుగా ఎ.గోవిందు ఎన్నికయ్యారు. మంగళవారం మండల విలేకరులు సమావేశం నిర్వహించారు. గోవిందును అధ్యక్షనుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా డి.విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా బి.కుమార్, ఉప కార్యదర్శిగా హనుమంతు, ట్రెజరర్‌గా భీమన్న, సలహాదారులు ఉరుకుందును ఎన్నుకున్నారు. సభ్యులుగా భీమశేఖర్, శివరాం, ఖలీల్, నాగేష్, రంగన్న ఉన్నారు. ఈ సందర్భంగా సీనియర్ విలేకరి ఉరుకుంద మాట్లాడారు. మండలంలోని విలేకరుల ఐకమత్యం కోసం కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



మాలల హక్కులను కాలరాస్తున్న 'కూటమి'

ప్రజాశక్తి- ఆలూరు : మాలల హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గుడిసె మహానంది విమర్శించారు. మంగళవారం ఆలూరులో విలేకరులతో మాట్లాడారు. మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్ బాబు ఈనెల 3న కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు మాలల రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహిస్తున్నారని, కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటని తెలిపారు. మాల మహానాడు జిల్లా నాయకులు అడ్వకేట్ వీరేష్, మల్లికార్జున, నాగేంద్ర, మహేష్ పాల్గొన్నారు.